# 'టీఎస్ఎస్‌పీడీసీఎల్'కు స్కాచ్ అవార్డులు




నవతెలంగాణ, వాణిజ్య విభాగం: తెలంగాణలో వెలుగులు నింపేందుకు కృషి చేస్తున్న 'తెలంగాణ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ' (టీఎస్ఎస్‌పీడీసీఎల్)కి ప్రతిష్ఠాత్మకమైన రెండు 'స్కాచ్ ఆర్డర్ ఆఫ్ మెరిట్' అవార్డులు లభించాయి. వినియోగదారులకు మంచి నాణ్యమైన సేవలను, పూర్తిపారదర్శకంగా అందించే ందుకు టీఎస్ఎస్‌పీడీసీఎల్ అనుసరిస్తున్న 'స్మార్ట్ మీటరింగ్', 'ఐఆర్, ఐఆర్‌డీఏ మీటర్ల ద్వారా ఆటోమెటిక్ బిల్లింగ్' విధానాలకు గుర్తింపుగా ఈ అవార్డులను ప్రకటించారు. ఈ విధానాల వల్ల కచ్చితమైన బిల్లింగ్‌తో పాటు బిల్లింగ్‌లో పారదర్శకత వృద్ధి చెందిన విషయం తెలిసిందే. న్యూఢిల్లీలో ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో సంస్థ తరపున రఘురామ రెడ్డి ఈ అవార్డులను అందుకున్నారు. టీఎస్ఎస్‌పీడీసీఎల్ సంస్థ అందిస్తున్న మెరుగైన సేవలకు గాను గతంలో ఇండియా పవర్ అవార్డు, ఐపీపీఏఐలతో పాటు పలు అవార్డులు లభించాయి.






ఢిల్లీలోని ఇండియా హాబిటేట్ సెంటర్‌లో గురువారం స్కాచ్ 'ఆర్డర్ ఆఫ్ మెరిట్' అవార్డును అందుకుంటున్న టీఎస్‌పీఎస్సీ కమిషన్ చైర్మన్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి, టీఎస్ఎస్పీడీసీఎల్ సంస్థ సీఎండీ రఘుమారెడ్డి.. డిజిటల్ తెలంగాణ ఓఎస్డీ రాధా సింధియా.. 'మీ సేవ' కమిషనర్ వెంకటేశ్వర్‌రావు, డిప్యూటీ డైరెక్టర్లు పెండ్యాల శ్రీనివాస్, నరసింహ

# స్మార్ట్ టెక్నాలజీలో నాలుగు అవార్డులు

- 'మీసేవ', డిజిటల్ తెలంగాణ, టీఎస్‌పీఎస్సీలకు ఒక్కో అవార్డు
- టీఎస్ఎస్పీడీసీఎల్‌కు రెండు 'ఆర్డర్ ఆఫ్ మెరిట్' అవార్డులు

**న్యూఢిల్లీ/హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** స్మార్ట్ టెక్నాలజీ వినియోగంలో తెలంగాణకు నాలుగు అవార్డులు లభించాయి. ఆన్‌లైన్‌లో ఉద్యోగ నియామకాలకు తొలిసారి భారీస్థాయిలో పోటీ పరీక్షలు నిర్వహించినందుకు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ), ఉత్తమ సేవలతోపాటు భవిష్యత్‌లో సులభంగా పౌర సేవలందించేందుకు కొత్త అప్లికేషన్ రూపొందించినందుకు 'మీ సేవ'కు 'స్కాచ్ ఆర్డర్ ఆఫ్ మెరిట్ అవార్డు - 2015', డిజిటల్ తెలంగాణ ప్రాజెక్టు అమలుకు ఐదు ప్రోగ్రామ్‌లు రూపొందించినందుకు అవార్డును అందుకున్నాయి. స్మార్ట్ టెక్నాలజీతో వినియోగదారులకు సేవలందించినందుకు తెలంగాణ రాష్ట్ర దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్ఎస్పీడీసీఎల్) రెండు 'ఆర్డర్ ఆఫ్ మెరిట్' అవార్డులు గెలుచుకున్నది. 'స్కాచ్' సంస్థ ప్రతియేటా ఈ అవార్డులు ప్రదానం చేస్తున్నది. గురువారం జరిగిన 'ఇండియా హాబిటేట్ సెంటర్'లో జరిగిన కార్యక్రమంలో స్కాచ్ సంస్థ చైర్మన్ సమీర్ కొచ్చార్ మాట్లాడుతూ స్మార్ట్ టెక్నాలజీ వినియోగంలో తెలంగాణ కృషిని అభినందించారు. సమీర్‌కొచ్చార్ చేతుల మీదుగా టీఎస్‌పీఎస్సీ తరపున కమిషన్ చైర్మన్ ప్రొఫెసర్ ఘంటాచక్రపాణి, 'మీ సేవ' కమిషనర్ వెంకటేశ్వర్‌రావు, డిప్యూటీ డైరెక్టర్ పెండ్యాల శ్రీనివాస్, నరసింహ, డిజిటల్ తెలంగాణ ఓఎస్డీ రాధా సింధియా, టీఎస్ఎస్పీడీసీఎల్ తరుపున సంస్థ సీఎండీ రఘుమారెడ్డి అవార్డులు అందుకున్నారు.

**ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహించినందుకే: ఘంటా చక్రపాణి**

ఏ రాష్ట్రంలోనూ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఉద్యోగార్థులకు భారీ స్థాయిలో పరీక్షలు నిర్వహించలేదని టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి అన్నారు. 'స్కాచ్' అవార్డు అందుకున్న తర్వాత ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ ఏర్పాటైన 11 నెలల 22 రోజుల్లోనే తాము ఆన్‌లైన్‌లో తొమ్మిది పోటీ పరీక్షలను ఐటీ పరిజ్ఞానం వినియోగంతో ఒక్కపొరపాటు, ఒక్క ఆరోపణ లేకుండా నిర్వహించినందుకు ఈ అవార్డు లభించిందన్నారు.

**డిజిటల్ తెలంగాణలో ఐదు ప్రాజెక్టుల రూపకల్పనతోనే..**

డిజిటల్ తెలంగాణ పథకం అమలు కోసం ప్రభుత్వం చొరవ తీసుకుని ఐదు ప్రాజెక్టులు రూపొందించి తగిన పనులు చేపట్టినందుకే అవార్డు లభించిందని సంస్థ ఓఎస్డీ రాధా సింధియా చెప్పారు. ఈ సందర్భంగా రాధా సింధియా మీడియాతో మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ అక్షరాస్యత పెంపుదలకు రాష్ట్ర ఐటీశాఖ మంత్రి కే తారక రామారావు ప్రత్యేక చొరవతో 'తెలంగాణ అకాడమీ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ (టాస్క్)' ఏర్పాటు చేశారన్నారు.

**ఉత్తమ సేవలతోపాటు కొత్త అప్లికేషన్ రూపకల్పనతో..**

'మీ సేవ' ద్వారా ఇప్పటికే ఐదు కోట్ల మందికిపైగా పౌర సేవలందించడంతో పాటు ప్రతిరోజూ లక్ష మందికి వివిధ రకాల సేవలందించే వ్యవస్థను నిర్వహిస్తున్నందుకు స్కాచ్ అభినందించింది.

**విద్యుత్ సరఫరాలో ఐటీ వినియోగం వల్లే..**

ఐటీ పరిజ్ఞానం వినియోగంతో విద్యుత్ సరఫరాలో సాంకేతిక లోపాల నివారణ, బిల్లుల వసూళ్లకు ఐటీ వినియోగంతో కొత్త వ్యవస్థ రూపకల్పన తదితర అంశాలతో టీఎస్ఎస్పీడీసీఎల్‌కు 'స్కాచ్' నుంచి రెండు 'ఆర్డర్ ఆఫ్ మెరిట్' అవార్డులు లభించాయి. వినియోగదారులకు అధిక నాణ్యతతో కూడిన విద్యుత్ సరఫరా చేస్తూ టెక్నాలజీ సాయంతో ఆటోమేటిక్ స్పాట్ బిల్లింగ్, స్మార్ట్ మీటరింగ్‌పై స్కాచ్ నిర్వహించిన సర్వేలో టీఎస్ఎస్పీడీసీఎల్ మొదటి స్థానంలో నిలిచింది.




'42వ స్కోచ్ సమ్మిట్'లో అవార్డులను అందుకుంటున్న రఘుమారెడ్డి

# 'స్కోచ్ ఆర్డర్ ఆఫ్ మెరిట్-2015' అవార్డులు టిఎస్ఎస్‌పిడిసిఎల్ కైవసం

**మన తెలంగాణ/** హైదరాబాద్: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రవేశ పెట్టడం ద్వారా విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలందిస్తు నందుకు తెలంగాణ దక్షిణ మండల విద్యుత్ పంపిణీ సంస్థ (టిఎస్ఎస్ పిడిసిఎల్) రెండు 'స్కోచ్ ఆర్డర్ ఆఫ్ మెరిట్-2015' అవార్డులను కైవసం చేసుకుంది. విద్యుత్ వినియోగదారుల బిల్లింగ్‌లో 'స్మార్ట్ మీటరింగ్, ఐఆర్ ఐఆర్‌డిఎ మీటర్ల ద్వారా ఆటోమెటిక్ స్మార్ట్ బిల్లింగ్ కేటగిరిలలో ఎస్‌పిడిసిఎల్ ఈ అవార్డులను అందుకుంది. ఢిల్లీలోని ఇండి యా హాబిటేట్ సెంటర్‌లో గురువారం జరిగిన '42వ స్కోచ్ సమ్మిట్'లో టిఎస్ఎస్‌పిడిసిఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ జి.రఘుమారెడ్డి ఈ అవార్డును స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యు త్ వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన విద్యుత్‌ను అందించేందు కు ఎప్పటికప్పుడు అవసరమైన అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడంలో ఎస్‌పిడిసిఎల్ ముందున్నదని చెప్పారు. విద్యుత్ నష్టాలను తగ్గించడం, మీటర్ రీడింగ్‌లో పారదర్శకత, బిల్లింగ్‌లో స్పష్టత కోసం 'స్మార్ట్ మీటరింగ్, ఐఆర్ ఐఆర్‌డిఎ మీటర్ల ద్వారా ఆటోమెటిక్ స్మార్ట్ బిల్లింగ్' విధానాలను అమలు చేస్తున్నామని ఆయన వివరించారు.

## తెలంగాణ డిస్కంకు ఉత్తమ పురస్కారాలు

ఈనాడు, హైదరాబాద్: స్మార్ట్ మీటర్ల ఏర్పాటు, ఆటోమేటిక్ స్పాట్ బిల్లుల పంపిణీకి చేపట్టిన చర్యలతో పనితీరు మెరుగుపరిచినందుకు తెలంగాణ దక్షిణప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(ఎస్పీడీసీఎల్-డిస్కం)కు జాతీయస్థాయిలో రెండు ఉత్తమ పురస్కారాలు లభించాయి. ఆధునిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడం ద్వారా వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తున్న సంస్థగా ఎస్పీడీసీఎల్ ఈపురస్కారాలకు ఎంపికైంది. గురువారం దిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ పురస్కారాలను స్కోచ్ గ్రూపు సంస్థ ప్రతినిధి సమీర్‌కొచ్చర్ చేతుల మీదుగా ఎస్పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డి అందుకున్నారు. విద్యుత్‌సంస్థల పనితీరులో మెరుగ్గా పనిచేసే వాటిని గుర్తించి ఏటా 'స్కోచ్ గ్రూపు సంస్థ' ఉత్తమ పురస్కారాలను అందజేస్తుంది. జాతీయస్థాయిలో ఈపురస్కారాలకు ఎంతోగుర్తింపు ఉందని ఎస్పీడీసీఎల్ తెలిపింది. స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు వల్ల మీటర్ రీడింగ్ నమోదులో పారదర్శకత, బిల్లుల్లో కచ్చితత్వం పెరిగాయని సంస్థ తెలిపింది.



**సమీర్‌కొచ్చర్ నుంచి పురస్కారాన్ని అందుకుంటున్న ఎస్పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డి**

# టీఎస్‌పీఎస్సీకి మెరిట్ పురస్కారం

- **మీసేవ, ఎస్‌పీడీసీఎల్‌కూ అవార్డు**
- **ప్రదానం చేసిన స్కాచ్ ఫౌండేషన్**

న్యూఢిల్లీ, హైదరాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగ సంస్థల పనితీరును గుర్తించి ఇచ్చే ప్రతిష్ఠాత్మక స్కాచ్ ఆర్డర్ ఆఫ్ మెరిట్ అవార్డు ఈసారి తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు దక్కింది. పూర్తిస్థాయిలో డిజిటల్ పద్ధతిలో పోటీ పరీక్షలు నిర్వహణ, దాదాపు ఆరున్నర లక్షల మంది నిరుద్యోగుల వివరాలతో డేటా బ్యాంక్ రూపకల్పన, ఎలాంటి అవకతవకలు లేకుండా తొలి పరీక్ష నిర్వహించడంతో పాటు, డిజిటల్ పద్ధతిలో పూర్తి పారదర్శకంగా ఉద్యోగ నియామకాలు చేపట్టడం తదితర అంశాలను పరిగణలోకి తీసుకున్న స్కాచ్ ఫౌండేషన్ టీఎస్‌పీఎస్సీని అవార్డుకు ఎంపిక చేసింది. ఈ అవార్డు కోసం దేశవ్యాప్తంగా దాదాపు 700 ప్రభుత్వ రంగ సంస్థలు పోటీ పడినప్పటికీ.. ఏడాది వయసు కూడా లేని టీఎస్‌పీఎస్సీకి స్కాచ్ ఆర్డర్ ఆఫ్ మెరిట్ అవార్డు దక్కడం ఎంతో ఆనందంగా ఉందని ఛైర్మన్ ఘంటా చక్రపాణి చెప్పారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో హైదరాబాద్‌లో పబ్లిక్ సర్వీస్ కమిషన్ల జాతీయస్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్టు వివరించారు. మరోవైపు రాష్ట్రంలోని మీ-సేవా కేంద్రాల ద్వారా వివిధ రకాల సేవలు అందించినందుకుగాను... ఎలక్ట్రానిక్ సర్వీసెస్ ఆఫ్ డెలివరీ(ఈఎస్‌డీ) విభాగానికి 'స్కాచ్ అవార్డును' బహూకరించారు. ఈమేరకు గురువారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఈఎస్‌డీ కమిషనర్ వెంకటేశ్వరరావు ఈ అవార్డును అందుకున్నారు. కాగా, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వినియోగదారులకు విద్యుత్ సరఫరా, ఇతర సేవలు చేస్తున్నందుకుగాను తెలంగాణ ఎస్‌పీడీసీఎల్ రెండు స్కాచ్ ఆర్డర్ ఆఫ్ మెరిట్ అవార్డుల్ని అందుకుంది. గురువారం ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఎస్‌పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డి ఈ అవార్డుల్ని అందుకున్నారు.



**ఢిల్లీలో అవార్డును అందుకుంటున్న ఎస్‌పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డి**

## ✦ 'స్కోచ్' పురస్కారం అందుకున్న ఎస్పీడీసీఎల్

సాక్షి, హైదరాబాద్: వ్యాపార రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అమలుకు కృషి చేసినందుకు గాను దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్ఎస్పీడీసీఎల్)కు రెండు 'స్కోచ్ ఆర్డర్ ఆఫ్ మెరిట్' పురస్కారాలు వరించాయి. స్మార్ట్ మీటర్ల వినియోగంతో పాటు వినియోగదారులకు బిల్లులు జారీ చేసేందుకు ఐఆర్ మీటర్లు వినియోగిస్తూ ఆటోమెటిక్ స్పాట్ బిల్లింగ్ సేవలను అందిస్తున్నందుకు ఎంపికైంది. ఎస్పీడీసీఎల్ సీఎండీ జి.రఘుమారెడ్డి గురువారం న్యూఢిల్లీలో ఈ అవార్డులను స్వీకరించారు.




పురస్కారాన్ని అందుకుంటున్న రఘుమారెడ్డి

### 'స్కోచ్' అవార్డు అందుకున్న టీఎస్పీఎస్సీ చైర్మన్



ఆన్‌లైన్‌లో ఎక్కువ విద్యార్థులకు పరీక్షలు రాసే అవకాశం కల్పించినందుకు గాను రాష్ట్ర పబ్లిక్ సర్వీసు కమిషన్ (టీఎస్పీఎస్సీ)కు లభించిన స్కోచ్ అవార్డును కమిషన్ చైర్మన్ ఘంటా చక్రపాణి అందుకున్నారు. ఐటీ విస్తరణ, సేవల వినియోగంలో విస్తృత చర్యలు చేపట్టినందుకు గాను ఈ అవార్డు దక్కింది.